రైతుల ముఖం 'కంది'పోతోంది

- నత్తనడకన కందుల కొనుగోలు ప్రక్రియ
- ఇప్పటి దాకా కేవలం 3.17 క్వింటాళ్ల ధాన్యం కాటా
- పారుమంచాల్లోనే అధికంగా ధాన్యం కొనుగోలు
- మిగిలిన గ్రామాల్లో కందుల కాటా ప్రారంభించాలంటున్న రైతులు



పారుమంచాలలో కందులను కాటా వేస్తున్న హమాలీలు

జూపాడుబంగ్లా: నాఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కందుల కొనుగోలు ప్రక్రియ నత్తనడకన కొనసాగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఇప్పటిదాకా కేవలం సుమారు 50 మంది రైతుల నుంచి కేవలం 317 క్వింటాళ్ల కందులు కాటా వేసి గోదాముకు తరలించినట్లు సమాచారం. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను కేవలం ఎకరాకు ఐదు క్వింటాళ్ల చొప్పున మాత్రమే నాఫెడ్ వారు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పంటదిగుబడి ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దాకా వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. అలాంటప్పుడు నాఫెడ్ వారు ఎకరాకు కేవలం 5 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన ధాన్యాన్ని ఎక్కడ, ఎలా విక్రయించుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కందులకు మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550లు ప్రకటించగా బహిరంగ మార్కెట్లో వ్యాపారులు కుమ్మక్కై క్వింటాల్ కందులు కేవలం రూ.6,800లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.750ల చొప్పున నష్టపోవాల్సి ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే కందులను విక్రయించుకుంటున్నారు. కొనుగోలు కేంద్రంలో కేవలం ఎకరాకు 5 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు కేవలం ఐదు క్వింటాళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన ధాన్యాన్ని తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కందుల మాయిశ్చర్ 14 శాతం ఉండాలనటం, హమాలీకాటా ఖర్చు క్వింటాలుకు రూ.130ల భారం రైతులపైనే మోపుతుండటంతో మూలిగే నక్కపై తాటికాయపడ్డట్లుగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి

మండలం వ్యాప్తంగా 12 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటిదాకా కేవలం ధాన్యం కొనుగోలు కేంద్రం పారుమంచాల, తర్తూరు, తరిగోపుల గ్రామాల్లో మాత్రమే ఇప్పటిదాకా ధాన్యం కాటావేయగా మిగిలిన గ్రామాల్లో ఇప్పటిదాకా ధాన్యం కొనుగోలు చేసేందుకు కాటా ఏర్పాటుచేయలేదని రైతులు పేర్కొంటున్నారు. మిగిలిన గ్రామాల్లో వెంటనే కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటిదాకా అధికంగా పారుమంచాల గ్రామంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రైతుల నుంచి కందులు కొనుగోలు చేయటం సమంజసంగా లేదని రైతులు పేర్కొంటున్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకే ప్రాధాన్యత

ఖరీఫ్‌లో సాగుచేసిన కంది పంటను ఈక్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ధాన్యం చేతికందిన రైతులు నాఫెడ్ కొనుగోలు కేంద్రంలో కందులు విక్రయించేందుకు రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకున్న వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. పేర్లు నమోదు చేయించుకున్నా సాంకేతిక సమస్యల వల్ల సెల్‌ఫోన్‌కు ధాన్యం కాటా వేసే తేదీ మెసేజ్ రాకపోతే మెసేజ్ వచ్చేదాకా రైతులు ధాన్యం కాటా వేయించుకునేందుకు వేచిచూడాల్సి వస్తుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. దీనికితోడు ధాన్యం కాటా వేసిన తర్వాత సకాలంలో ధాన్యాన్ని గోదాములకు తరలించటం లేదని కనీసం వారం రోజుల సమయం పడ్తుందని అప్పటిదాకా కాటా వేసిన ధాన్యం వద్ద కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో కందుల కొనుగోలు వివరాలు

మండలం పేరు	కొనుగోలు చేసిన కందులు
మిడుతూరు	271.7 మెట్రిక్ టన్నులు
నందికొట్కూరు రూరల్	20.55 మెట్రిక్ టన్నులు
పాములపాడు	29.45 మెట్రిక్ టన్నులు
జూపాడుబంగ్లా	75.35 మెట్రిక్ టన్నులు
నందికొట్కూరు పట్టణం	20.09 మెట్రిక్ టన్నులు

రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతు వద్ద ధాన్యం కొంటాం



ఖరీఫ్‌లో కంది పంటను సాగుచేసుకొని ఈక్రాప్ బుకింగ్‌తో పాటు ధాన్యం విక్రయించేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతు వద్ద ధాన్యం కొంటాం. ధాన్యం కాటావేసిన తర్వాత సంచులు కాటావేసేందుకు అవసరమైన కుట్టుమిషన్లు సక్రమంగా పనిచేయకపోవటం వల్ల కాస్త కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా జరుగుతుంది. త్వరలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి పేర్లు నమోదు చేసుకున్న రైతులందరి వద్ద ధాన్యం కొంటాం. – చంద్రశేఖర్‌గౌడు, సీఈఓ, 80బన్నూరు సహకార సొసైటీ

క్లుప్తంగా

పల్లకీలో మహానందీశుడి దంపతులు విహారం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు శరభయ్యశర్మల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువు తీర్చి వేదోక్తంగా పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం జరిపారు.

విద్యార్థినులకు పరీక్షా సామగ్రి పంపిణీ



సామగ్రిని అందిస్తున్న ఐటీడీఏ పీఓ శివప్రసాద్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఉన్న బైర్లూటి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థినులకు శుక్రవారం పరీక్షలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. శ్రీశైలం ఐటీడీఏ పీఓ కేవీ శివప్రసాద్ విద్యార్థినులకు అవసరమైన రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రభుత్వ సౌకర్యాలను చక్కగా వినియోగించుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భగా ఆయన విద్యార్థినులకు ఉద్బోధించారు.

విలీనం సభను జయప్రదం చేయండి

నందికొట్కూరు: ఈ నెల 23న విజయవాడలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్), న్యూడెమొక్రసీ పార్టీల విలీనం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు నరసింహులు, మజీద్‌మియ్యా కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలీనం సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, ప్రేమరాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారంతో సోదాలు చేయగా నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊట, నాటుసారా డ్రమ్ములను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు



ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి

పగిడ్యాల: గ్రామ శివారు ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను సులభతరంగా గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగంలోకి తెస్తున్నట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో డ్రోన్ కెమెరా ద్వారా నేరాల నియంత్రణ, రోడ్ సేఫ్టీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాట ఆడటం, మద్యం విక్రయించడం, మట్కా, జూదం తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

జూపాడుబంగ్లా: నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జయసూర్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆయాశాఖల అధికారుల సమక్షంలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెలుగోడు: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల విద్యుత్ పరిధిలోని అన్ని సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల పనులు ఉండటంతో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

18 నుంచి 21 వరకు ఆధార్ క్యాంపులు

కొత్తపల్లి: ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మండలంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ దుద్యాల-2, గోకవరం సచివాలయాల పరిధిలో రెండు బృందాలను ఏర్పాటు చేసి ఆధార్‌క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దుద్యాల -2 పరిధిలోని ఎదురుపాడులో 18, కొక్కెరంచ 19, దుద్యాల1లో 20, నందికుంట 21 తేదీలలో ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. గోకరవరం సెక్టార్ కింద ఎర్రమఠం గ్రామ పంచాయతీలో 18, 19, 20, ముసలిమడుగు గ్రామంలో 21వ తేదీలో ఆధార్ క్యాంపులు ఉంటాయని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుణాలకు 448 దరఖాస్తులు

పాములపాడు: బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ ద్వారా 448 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బానుముక్కల 46, చెలిమిల్ల 40, ఇస్కాల 20, జూటూరు 54, కంబాలపల్లి 4, మద్దూరు 64, మిట్టకందాల 13, పాములపాడు 130, తుమ్మలూరు 30, వానాల 36, వేంపెంట 51మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారన్నారు. శనివారం వరకు గడువు ఉండటంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

సామాన్యుల సంక్షేమ బడ్జెట్ కావాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు యేసురత్నం

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులపై భారాలు వేసి, సంపన్నులకు లాభాలు దోచి పెట్టే విధంగా ఉందని, బడ్జెట్‌ను సవరించి సామాన్యుల సంక్షేమ బడ్జెట్ ప్రవేశపెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సికిందర్‌బాషా, సామాజిక కార్యకర్త బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్.. సామాన్య ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళలు, దళిత, గిరిజనుల సంక్షేమానికి ఏ మాత్ర ఉపయోగపడేలా లేదన్నారు. వ్యవసాయానికి రూ.17వేల కోట్లు తగ్గించారన్నారు. ఉపాధి హామీ పథకానికి రూపాయి కూడా పెంచకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీల సంక్షేమానికి 16 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 3.4 శాతం కేటాయించడం, ఎస్టీల సంక్షేమానికి 8 శాతం కేటాయించాల్సి ఉండగా 2.6 శాతం నిధులు కేటాయించడం తగదన్నారు. జలజీవన్ మిషన్‌కు గతంలో రూ.70 వేల కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.67,000 కోట్లకు కుదించడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు భీమలింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దిలేటి, అతావుల్లా, కేవీపీఎస్ జిల్లా నాయకులు పి.భాస్కర్, ఎం.సంపత్, సీహెచ్ అంకిరాజు, రైతు సంఘం నాయకులు ఎస్.గోపాల్, ఎం.జ్ఞాన సూర్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.దేవకుమార్, ధర్మరాజు పాల్గొన్నారు.

ఆకతాయికి జైలుశిక్ష

మహానంది: బుక్కాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌సింగ్ ఈనెల 12న మద్యం తాగి దారిలో వచ్చిపోయే వారిపై అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునివ్వడంతో సబ్ జైలుకు తరలించామన్నారు.

పాదయాత్ర భక్తులకు వైద్యశిబిరాలు

పాములపాడు: శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు 24 గంటలు పనిచేసేలా కేజీ రోడ్డు వెంట 2 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శివరాత్రి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారన్నారు. వారికి ఎలాంటి వైద్య సేవలు అవసరమొచ్చినా జూటూరు గ్రామం, మండల కేంద్రంలోని హెల్త్ సబ్‌సెంటర్ల వద్ద వైద్యశిబిరాలతో సంప్రదించాలన్నారు.

బిల్లులు చెల్లించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: మిడ్‌డే మీల్స్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ మిడ్‌డే మీల్స్ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కార్మికులకు అందుతున్న బిల్లులపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నా మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని భోజన నిర్వాహకులు కుమారి, ఎస్తేరమ్మ, శ్రీలక్ష్మి వాపోయారు.

కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తలమెళ్ల రవి

నందికొట్కూరు: కర్నూలు జిల్లాకు దళిత ఆణిముత్యం, దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య పేరు పెట్టాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తలమెళ్ల రవి డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి నంద్యాల రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ప్యారడైస్ ఫంక్షన్ హాల్‌లో దామోదర సంజీవయ్య జయంతి వేడుకలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలమెళ్ల రవి మాట్లాడుతూ దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదర సంజీవయ్య నీతికి, నిజాయతీకి మారు పేరుగా నిలిచారన్నారు. కుల, మతాలకు అతీతంగా పింఛన్ పథకం అమలు చేసిన ఘనత సంజీవయ్యకే దక్కిందన్నారు. అనంతరం వంద మంది నిరుపేద మహిళలకు తహసీల్దార్ శ్రీనివాసులు చీరలు పంపిణీ చేశారు. దామోదర సంజీవయ్య జీవిత చరిత్రపై నిర్వహించిన ప్రతిభ పోటీల్లో సత్తా చాటినా విద్యార్థులకు సీఐలు సుబ్రమణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రత్నం, గాజుల పున్నమ్మ, మున్నెం శ్రీధర్, జయరాముడు, యాట ఓబులేసు, షకిల్ అహ్మద్, డాక్టర్ రాజు, తమ్ముడపల్లి ఏసేపు, వేల్పుల జ్యోతి, వనజ, ఖాదర్‌బాషా, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- **కొత్తపల్లి:** సంజీవయ్య జయంతి సందర్భంగా కొత్తపల్లి, గువ్వలకుంట్ల సచివాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారథి, సర్పంచులు నక్క విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, చాందీనిలు అన్నారు.
- **ఆత్మకూరు:** దామోదరం సంజీవయ్య చేసిన సేవలు మరువలేనివని వెంకటాపురం ఎస్సీ వసతిగృహం ఏఎస్‌డబ్ల్యూఓ అంకన్న అన్నారు. సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే రైతు సేవా సంఘం కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి రైతు సేవా సంఘం గౌరవాధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్‌బాషా, తదితరు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని రింగ్ పార్క్ సెంటర్‌లో దామోదరం సంజీవయ్య విగ్రహానికి అంబేడ్కర్ న్యాయసేవా సంఘం అధ్యక్షులు మైలా తులసీరాం, ప్రజా సంఘాల నాయకులు జనార్దన్, విజయ్, ఆశీర్వాదం, సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సారా విక్రయిస్తే చర్యలు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం నాటుసారా విక్రయిస్తున్న స్వాములును అరెస్టు చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా



రైతు సేవ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

వెలుగోడు: రైతులకు అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక రైతు సేవా కేంద్రం, సొసైటీ వద్ద యూరియా పంపిణీని పర్యవేక్షించారు. ఇప్పటి వరకు మండలానికి 1,280 మెట్రిక్ టన్నుల మంజూరైన యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. మరో 110 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు.

యూరియా సరఫరా చేయాలి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రత్నమయ్య, రైతు సంఘం నాయకుడు సుధాకర్ రెడ్డి, రైతు సంఘాల నాయకులు పరమేశ్వర రెడ్డి, సుబ్బరాయుడు, నాగరత్నం, వెంకటేశ్వర్లు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ పద్మావతిని కలిసి వినతి పత్రం అందజేశారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



దుకాణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

పాములపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో రహదారులకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం పోలీస్ భద్రత మధ్య తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం క్రితమే దుకాణాదారులందరికి నోటీసులు జారీ చేశామన్నారు. ప్రధాన రహదారిని వ్యాపారులు ఆక్రమించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. దుకాణదారులు, యజమానులు సహకరించాలన్నారు. మళ్లీ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ రంగ నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు, వీఆర్వోలు శివన్న, ముర్తుజావలి పాల్గొన్నారు.

'విశిష్ట గుర్తింపు'ను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు విశిష్ట గుర్తింపు నమోదును మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు ప్రక్రియ చేస్తున్నందున రైతులు ఆధార్, పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఓటీపీతో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీలోగా విశిష్ట గుర్తింపు కోసం నమోదు చేసుకోవాలని ఏఓ కోరారు.

రెండో రోజు కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: నష్టపరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించిన నీటిముంపు నిర్వాసితుల అవార్డుదారుల ధ్రువపత్రాల పరిశీలన రెండో రోజు శుక్రవారం నెహ్రూనగర్‌లో కొనసాగింది. సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన వీరాపురం, మూర్వకొండ గ్రామ అవార్డుదారుల ధ్రువపత్రాల పరిశీలనలో రిటైర్డ్ తహసీల్దార్ విజయుడు పరిహారం పొందే అవార్డుదారుల జాబితాను చదివి వినిపించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ పుస్తకం, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు అందజేయాలని కోరారు. ఒకవేళ మృతి చెందివుంటే వారి వారసులు సంబంధిత డెత్ సర్టిఫికెట్, అఫిడవిట్, ఎస్‌టీసీ, ఫ్యామిలీ మెంబర్, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలని సూచించారు. ధ్రువపత్రాలు సమర్పించిన అవార్డుదారులకు వచ్చే నెల 4న కర్నూలు జిల్లా కోర్టులో చెక్స్ పంపిణీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిర్వాసితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే శనివారం మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిడ్యాల, కొత్త పాలమర్రి గ్రామాల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు హేమలత, వెంకటస్వామి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ముందుగా వైద్యాధికారి దీపానాగవేణి, కంటి వైద్య నిపుణులు షేక్షావలి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి దీపా నాగవేణి మాట్లాడుతూ దృష్టిలోపాలను అధిగమించేందుకు పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తొలి దశలోనే దృష్టి లోపాన్ని గుర్తించి, కంటి అద్దాలను వాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రామలక్ష్మి, హెల్త్ సూర్‌వైజర్ దేవకరుణమ్మ, టీబీ సూపర్ వైజర్ చెరుకు రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ నాగభూషణంశెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

కల్తీకల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



కల్తీకల్లుపై ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు: కల్తీ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ శుక్రవారం మండల పరిధిలోని అల్లూరులో టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్యను కలిసి కల్తీకల్లు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే కల్తీకల్లు తాగి మరణించిన కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు దక్క కుమార్, మర్రిస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

